# మందు

"అమ్మాయి నిన్న సాయంత్రమల్లా బాగానేవుండిం దండీ పిన్నీ. ఒక్కటే జ్వరం. మీ అల్లుడుగారైనా వూళ్లో లేరైరి....వారు నిన్న ఉదయమే మా ఆడబిడ్డగారి వూరికి వెళ్లారు. వారు వెళ్లేప్పటికి గూడా బాగానే ఆడుకుంటూ వుందండీ........అంతా సిద్ధమై చివరకి కోటేసుకొనే సరికి, 'నేనూ వూరికి వొస్తానని' అమ్మాయి యెక్కడలేని మారాము మొదలెట్టిందండీ—యెందుకిల్లా అనవసరంగా మారాం చేస్తూ వుందా అనివారు కొంచం విసుక్కుని, అణా చేతులోపెట్టి, అప్పటిమట్టుకి యెల్లానో సముదాయించి వెళ్లిపోయారు. తరువాత సాయంత్రందాకా బాగానే ఆడుకుంది—కొంచం చీకటిపడగానే నేను పిల్లకి అన్నంపెట్టి పడుకోబెట్టాను. అర్ధగంట తరువాత మా రాముడికికూడా వొడ్డించి, వొచ్చి చూతునుగదా అమ్మాయికి కాస్త వొళ్ళు వెచ్చబడివుంది. దృష్టిదోషం యేమన్నా తగిలిందేమోనని కాసిని మిరపకా యలూ, యేడు చీపురుపుల్లలూ వొంటిమీదినించి తిప్పి పొయిలో పోశాను. పుల్లలన్నీ చిటుపటు మన్నాయి—పిడికె డన్ని మిరపకాయలు తిప్పి పొయిలో వేసినా యింట్లో కొం చమైనా ఘాటన్న మాటేలేదు, అదో విధమైన మాడువాసన తప్ప."

'అవునండి అమ్మాయికి బాగా దిష్టే అయివుంటుంది.'

"యేమోనండీ, యేమీ తెలియటంలేదు. పిన్నీ, అసలు దృష్టి దోషమవుతే యింత జ్వర మెందుకొస్తుం దండీ—నిన్న సాయంత్రంనించీ వొకటే జ్వరం—యింత వరకు చెమటన్న మాటేలేదు."

"బజారులో యెక్కడచూచినా అక్కడ తల్లి ప్రత్య క్షం—ఆమె మహిమేమన్నా కనపడుతూ వుందేమో చూచారా."

"పిన్నీ ఆ కాస్తేదో మీరేచూతురూ? కాపురానికి వొచ్చి ఆరు సంవత్సరాలయినా నాకటువంటి దేదీ యింత వరకు అనుభవంలోకి రాలేదు—మీ పుణ్యముంటుంది, అదేదో మీరే చూచిపెట్టండి."

"అయ్యో, దానికి యింత ప్రాధేయపడాల్సిన అవస రమేముందండీ? అమ్మాయిని చూచి నాకు తెలిసిందేదో చెప్పకపోతే మేము యింటిపక్కనే వుండిమాత్రం యేమి లాభమండీ."

శాంత చెమ్మగిల్లిన నేత్రాలనీ కొంగుతో వొత్తు కుంటూ 'బుజ్జి' పడుకొనివున్న గదిలోకి దారితీసింది. రాధ మ్మగారు కొస్త విచారంగా, మెదలకండా శాంతను అను సరించింది—యిద్దరూ రోగిని పరీక్షించి, రెండు నిమిషాల తరువాత గది వెలుపలికి వొచ్చారు.

"యింకేమీ లేదమ్మా — యిదంతా ఆ తల్లి ప్రభావమే."

"పిన్నీ, అమ్మాయికి ఈరోజు మందు పోయమంటారా, వొద్దా" అని శాంత కొంచం ఆదుర్దాగా పిన్నినడిగింది.

"మందా! అసలు మందుమాటే యెత్తవొద్దు-ఆ తల్లికి కాస్త దండంపెట్టి రెండుపైసలు ముడుపుగట్టండి. ఆమె కృపవల్ల జ్వరం సాయంత్రం వరకూ తిరుగుముఖం పడుతుంది."

రాధమ్మగారు వెళ్ళిపోవటంతోనే శాంత పైసలుతీసి, అమ్మవారికి దండంపెట్టి ముడుపు కట్టింది. యింక ఆరోజుకి మందూ, గిందూ అంతా చెల్లు—

*　　　　*

మరునాడుకూడా 'బుజ్జి'కి జ్వరం తగ్గలేదు. ఆ రోజు రాత్రంతా వొకటే పలవరింతలు—కూతురు అవస్థచూచి శాంత ఆ రోజురాత్రి యెంత ప్రయత్నం చేసినా పడుకోలేకపోయింది. ఉదయం లేవటంతోనే తన తమ్ముణ్ణి పిల్చి—

'రాముా, యిది తల్లి ప్రభావంకాదూ, మన్నూకాదు. 'బుజ్జి' కేదోపెద్ద జబ్బు చేసింది. దానికి పడుకున్నపాటు కదలటానికి కూడా చాత నవటంలేదు. రెండు రోజుల క్రితం

వొచ్చిన జ్వరం యింతవరకూ దిగలేదు. నీవుపోయి యెవ రినన్నా మంచి డాక్టర్‌ని తీసుకొస్తేనే కాని లాభంలేదంటూ' ఆమె కళ్ళల్లో నీళ్ళు నింపుకుంది.

అక్కగారి దైన్యాన్ని చూచి రాము యేమీ మాట్లాడ లేకపోయాడు. తక్షణమే కోటుకూడా వేసుకోకండా పైతుండుగుడ్డ పైనే వుండగా డాక్టరు దెగ్గరికి వెళ్ళాడాతను అమితమైన ఆవేదనతో.

అర్ధగంట తరువాత డాక్టరువొచ్చి 'బుజ్జి'ని యెంతో సేపు పరీక్షించాడు. సంగతి సందర్భాలు చూస్తే మనిషేమీ నిర్ధారణకి వొచ్చినట్లు తోచలేదు రాముకి—జబ్బేమిటో కను క్కుందామన్న ఉద్దేశంతో

"యేమిటీ, యింతసేపు పరిక్షించారు" అన్నాడు రాము.

'ఆఁ, యేమీలేదు. రెండు రోజుల్లో నిమ్మళిస్తుంది.'

వొహనిముషం ఆగి ఆతనిముఖ కవళికని వీక్షించి —'మామూలు జ్వరానికే మీరు ఝింత గాభరాపడట మెం దుకండీ' అని రాముని హెచ్చరించి, ఆతన్ని మందుకోసం వెంటబెట్టుకొని కారులో యింటివేపు బయల్దేరాడు డాక్టరు బాబు.

"అసలు జబ్బేమిటని" కొంచంసేపుఅయిన తరువాత మళ్ళీ రెట్టించాడు రాము డాక్టరుని—

"యేదో పెద్దపేరు చెబితేమాత్రం లాభమేమిటి. మీకు జబ్బు నయమవటం ప్రధానంగాని."

అంతటితో రామునోటికి తాళంపడింది. దారిపొడుగునా మళ్ళీ యేవిధమైన ప్రశ్నలకికూడా యిహ తావులేకపోయింది.

నాలుగు రోజులయినా అమ్మాయి జ్వరం తిరుగుముఖం పట్టలేదు— యింటి వాళ్ళకి డాక్టరుని మార్చటం తప్ప వేరే గత్యంతరం కనపడలేదు.

*     *

రోజుకి రోజూ అమ్మాయి చిక్కి శల్యమైపోతూ వుంది. యెందరు డాక్టర్లువొచ్చినా అసలు జబ్బు విషయమై యేమీ నిర్ధారణ చేయలేకండా పోతున్నారు. వొహరు 'టైపాయిడు' వొహరు 'నిమోనియా' అంటారు. యిక్కడి డాక్టర్ల సంగతంతా చూచి అనవసరంగా కాలహరణం చేయటం సమంజసంకాదని తెలుసుకుని, బావగారొస్తే అమ్మాయినిగురించి యేదో ఆలోచిస్తారనే ఆశతో రాము "అమ్మాయి జబ్బుగావుందని" తంతి నిచ్చాడు విశ్వేశ్వరరావుగారికి.

తంతిని చూడటంతోనే విశ్వేశ్వరరావుకి పైప్రాణాలు పైననే లేచిపోయినాయి. కొంచమైనా ఆలస్యం చేయకండా తక్షణమే చెల్లెలి యుక్తంగా ఆపూరినించి బయల్దేరాడాతను.

ఇంటికి వొచ్చేసరికల్లా గూట్లో దీపాలుపెట్టే సమయమయింది. వొచ్చే రావటంతోనె కాళ్ళయినా కడుక్కోకుండా ఆతను అమ్మాయి దెగ్గరికివెళ్ళి 'బుజ్జీ,బుజ్జీ' అని ఆ నాలుగుయేళ్ళ కూనని తట్టిలేపాడు.

అమ్మాయి చివరకి కదలనైనా కదలకండా, నీరసం వల్ల అట్లానే పడుకునివుంది. తల్లి ఆవిషయం గమనించి "బుజ్జీ,బుజ్జీ మీ నాన్నగారు వొచ్చారే" అంది.

"నాన్న" అన్నమాట వినటంతోనే బుజ్జి కళ్ళు తెరిచింది. గది నాలుగు మూలలు వొహమాటు కలియజూచి నిజంగా "నాన్నగారు" వొచ్చారని తెలుసుకుని, నీరసంగా చిరునవ్వునవ్వుతూ రెండు చేతుల్నీ ఆతనికి అందించింది. విశ్వేశ్వరరావు లాలనగా అమ్మాయిని వొళ్ళోకి తీసుకుని "నాతల్లికి జబ్బుచేసిందా'' అంటూ గట్టిగా ముద్దెట్టుకున్నాడు.

బుజ్జి గొల్లున నవ్వి "నాన్నగారి'' మొహాన్నంతా తన చిన్ని చేతుల్తో తడుముతూ,అదో విధమైన అందంగా కళ్ళు తల్లికేసి తిప్పింది.

కూతురు చూపుల్లోని అర్థం గ్రహించి "యేమమ్మా! మీనాన్నగారు వొచ్చారా, నీకోసం వూరినించి యేమి తీసు

కొచ్చారో అడుగు" అంది శాంత ప్రేమపూర్వకంగా బుజ్జి బుగ్గ గిల్లుతూ.

ఆ సాయంత్రంనించీ బుజ్జి జ్వరం మటుమాయమై పోయింది.

*                *

"యెందరో డాక్టర్లు కుదుర్చలేని జబ్బుని వైద్యమంటే అసలే తెలియని విశ్వేశ్వరరావుగారు నయం చేశారు'' అంటుంది శాంత అప్పుడప్పుడు వేళాకోళంగా తన భర్తతో.